క్లుప్తంగా

రోడ్డు పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యం

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గురువారం శంకుస్థాపన చేశారు. టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్, నాయకులు బొమ్మరవేని తిరుపతి, నాగుల రాజశేఖర్‌గౌడ్, కోల రమేశ్ తదితరులున్నారు.

చిగురుమామిడి నాయబ్ తహసీల్దార్‌గా బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న స్వరూపారాణి

చిగురుమామిడి: చిగురుమామిడి మండల నాయబ్ తహసీల్దార్‌గా స్వరూపారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆ మె కరీంనగర్‌లో భూ సేకరణ విభాగంలో నాయబ్ తహసీల్దార్‌గా పని చేశారు. ఆమె మాట్లాడుతూ.. రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

సావిత్రిబాయి పూలే అవార్డుకు ఎంపిక



సమ్మన్న

వీణవంక: మల్లారెడ్డిపల్లికి చెందిన కళాకారుడు, కవి గోనెల సమ్మన్న సావిత్రిబాయి పూలే జాతీయ ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 20న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అవార్డు అందుకోనున్నట్లు సమ్మన్న తెలిపారు. అమ్మ ఫౌండేషన్ స్థాపించి, పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఆయన తెలంగాణ ఉద్యమం నుంచి ఎన్నో పాటలు రాస్తూ.. పాడుతూ గుర్తింపు తెచ్చుకున్నారు.

మున్నూరుకాపు యువజన సంఘం కార్యవర్గం



గన్నేరువరం: మున్నూరుకాపు యువజన సంఘం గన్నేరువరం గ్రామ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు బొద్దు సునీల్ తెలిపారు. అధ్యక్షుడిగా మంగరావు అరుణ్‌సాయి, ప్రధాన కార్యదర్శిగా మంగరాపు సాయికుమార్, ఉపాధ్యక్షులుగా పుల్లెల వెంకటేశ్, బొద్దు మహేశ్, కోశాధికారిగా బొమ్మ శ్రీనివాస్, కార్యదర్శిగా కొలుపుల అనిల్, సహాయ కార్యదర్శులుగా దొగ్గలి రాజు, పుల్లెల సాయి ఎన్నికైనట్లు పేర్కొన్నారు. సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు బొద్దు బాలయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఆటో ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ ఎన్నిక



శంకరపట్నం: కేశవపట్నం బస్టాండ్ అడ్డా ఆటో ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ ఎన్నిక గురువారం నిర్వహించినట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిట్టల సమ్మయ్య తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్ ఆధ్వర్యంలో కేశవపట్నంలో సమావేశమైనట్లు పేర్కొన్నారు. అధ్యక్షుడిగా రెడ్డి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కనకం మొగిలి, ప్రధాన కార్యదర్శిగా కనకం తిరుపతి, కార్యదర్శిగా దేవునూరి కుమార్, ప్రచార కార్యదర్శిగా కాటం సంపత్‌రెడ్డి ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

బాధితులకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న లచ్చన్న

గంగాధర: లక్ష్మీదేవిపల్లికి చెందిన దాసరి రమ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న తూడి లచ్చన్న గురువారం ఆమె ఇంటికి వెళ్లి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

రామడుగు: వెంకట్రావుపల్లికి చెందిన మిట్ట కుమార్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి తూడి లచ్చన్న గురువారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. మాజీ సర్పంచ్ జవ్వాజీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘నిఘా’.. వేలాడుతోంది

- స్తంభాలకు ఊడిపోయి కనిపిస్తున్న సీసీ కెమెరాలు
- వీణవంక మండలంలో 90 వరకు ఏర్పాటు
- నగానికి పైగా పని చేయని వైనం
- ప్రమాదాలు, చోరీలు జరిగితే నిందితుల గుర్తింపు కష్టం
- మరమ్మతు చేయాలని కోరుతున్న ప్రజలు



విద్యుత్ స్తంభానికి ఊడిపోయి, వేలాడుతున్న ఈ సీసీ కెమెరా వీణవంక మండల కేంద్రంలోని ఆటోస్టాండ్ వద్ద ఏర్పాటు చేసింది. ఇది ఆటోస్టాండ్ ప్రాంతంతోపాటు కేశవపట్నం మండలానికి వెళ్లే దారిని కవర్ చేస్తుంది. కొన్ని నెలలుగా ఈ నిఘానేత్రం ఊడిపోయి, పని చేయడం లేదు. ఈ దారిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. సీసీ కెమెరాలో రికార్డవుతుందన్న ఉద్దేశంతో అక్రమార్కులే ఈ పని చేశారేమోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. వీణవంక బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కెమెరాదీ ఇదే పరిస్థితి. మండల కేంద్రంలోనే నిఘానేత్రాల పనితీరు ఇలా ఉంటే గ్రామాల్లో ఎలా ఉందనేది ఊహించుకోవచ్చు.

ఆటోస్టాండ్ వద్ద స్తంభానికి వేలాడుతున్న కెమెరా



వీణవంక బస్టాండ్‌లో ఊడిపోయిన సీసీ కెమెరా

వీణవంక: గ్రామాల్లో అక్రమ కార్యకలాపాలకు చెక్ పెట్టేందుకు 2018లో అప్పటి పోలీస్ అధికారులు సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా ప్రమాదాలను అరికట్టేందుకు ప్రధాన రహదారులపై విద్యుత్ స్తంభాలకు వాటిని బిగించారు. అయితే, పని చేయకపోడం విమర్శలకు తావిస్తోంది. వీణవంక మండలంలోని కనపర్తికి చెందిన కొయ్యడ రమేశ్ 20 రోజుల క్రితం తన ద్విచక్ర వాహనంపై జమ్మికుంట నుంచి వస్తున్నాడు. జమ్మికుంట డిగ్రీ కళాశాల సమీపంలో వెనక నుంచి వచ్చిన కారు బలంగా ఢీకొట్టి, వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. డిగ్రీ కళాశాల నుంచి వీణవంక మండలం మామిడాలపల్లి వరకు అంటే సుమారు 26 కిలోమీటర్లు ఒక్క సీసీ కెమెరా పని చేయలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు ఆ కారు ఎక్కడిదనే విషయం తెలియలేదని చెబుతున్నారు. నిఘానేత్రాలు పని చేసి ఉంటే నిందితుడు దొరికేవాడని అంటున్నారు.

నిర్వహణ గాలికి..

వీణవకం మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా పోలీసులు దాతల సహాయంతో 90 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. బేతిగల్‌లో 6 బిగిస్తే ఒక్కటి కూడా పని చేయడం లేదు. ఇక్కడ ఇటీవల వరుస చోరీలు జరిగాయి. మండల కేంద్రంలోనూ ఇదే దుస్థితి నెలకొంది. కెమెరాలను ఏర్పాటు చేసి, నిర్వహణను గాలికొదిలేశారని, ఫలితంగా ఇసుక అక్రమ రవాణాతోపాటు రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా సాగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కెమెరాల నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీ చూసుకోవాలని గతంలో పోలీసులు సూచించారు. కానీ, పంచాయతీలకు సంబంధించినవారు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అంటున్నారు. ఇప్పటికైనా కెమెరాలకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

ఈ ప్రాంతాల్లో తప్పనిసరి..

50 మందికి పైగా జన సంచారం ఉన్న ప్రాంతాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్న నిబంధన ఉంది. మద్యం షాపులు, కిరాణా దుకాణాలు, ఫంక్షన్‌హాళ్లు, బస్టాండ్‌లు, ఫర్టిలైజర్ దుకాణాలు, హోటళ్లు, పెట్రోల్ బంకుల వద్ద వాటి నిర్వాహకులే నిఘానేత్రాలు ఏర్పాటు చేయాలి. అవి రోడ్డు కనిపించేలా ఉండాలి. ఎక్కడైనా నేరం జరిగితే నిందితులను గుర్తు పట్టే వీలుంటుంది. దీన్ని పకడ్బందీగా అమలు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మీ ఇల్లు ఇలాగే ఉంచుకుంటారా?

- రైతు వేదికలో దుమ్ము ఎందుకు తొలగించలేదు?
- తహసీల్దార్, ఏవోపై మండిపడిన ఎమ్మెల్యే సత్యనారాయణ



ఏవో వెంకటేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

శంకరపట్నం: కేశవపట్నం రైతువేదిక దుమ్ముతో ఉండటంతో తహసీల్దార్ భాస్కర్, ఏవో వెంకటేశ్‌లపై మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యేకు రైతు వేదిక దుమ్ముతో నిండి కనిపించడంతో ఎందుకు శుభ్రం చేయలేదు? ప్రభుత్వం భవనం అనుకుంటున్నారా? పశువుల కొట్టం అనుకుంటున్నారా? అని తహసీల్దార్‌ను నిలదీశారు. ఎమ్మెల్యే వస్తున్నాడని తెలిసినా అపరిశుభ్రంగా ఉంచుతారా?.. తాను చెక్కులు పంపిణీ చేయనంటూ కారులో కూర్చున్నారు. లబ్ధిదారుల కోసం రావా లని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను కోరడంతో రైతు వేదికలోకి వచ్చారు. మీ ఇల్లు ఇలాగే ఉంచుకుంటారా అంటూ ఏవోపై మండిపడ్డారు. పంచాయతీ సిబ్బంది రాలేదని ఆయన చెప్పడంతో.. నీ కార్యాలయంలో జీపీ సిబ్బంది ఎందుకు పనులు చేస్తరు? నువ్వే డబ్బులు ఖర్చు చేసి, ఇతరులతో శుభ్రం చేయించాలి.. ప్రజలు పన్నులు కడితేనే మీకు జీతాలు వస్తున్నాయని చెప్పారు. టేబుల్‌పై దుమ్మును తహసీల్దార్, ఏవోలతో తుడిపించారు. చూశారా.. మీ చేతులకు దుమ్ము ఎలా ఉందో అంటూ.. కూర్చోకుండానే లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి, వెళ్లిపోయారు.

పైపులైన్‌కు మరమ్మతు



చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీపై గురువారం ‘సాక్షి’ దినపత్రికలో వాట్సాప్ కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించి, వెంటనే మరమ్మతు చేయించారు. గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్

సంక్షిప్త వార్తలు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

హుజూరాబాద్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని హుజూరాబాద్ ఎంవీఐ వేణు అన్నారు. పట్టణంలోని క్యాబ్ ఓనర్లు, డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. డ్రైవర్లు తమ పక్కన ఎవరినీ ఎక్కించుకోవద్దని, మలుపులు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో వాహనాలను నెమ్మదిగా నడపాలన్నారు. రాత్రి వేళలో వాహనాన్ని నిలిపినప్పుడు పార్కింగ్ లైట్లు తప్పనిసరిగా వేయాలని సూచించారు.


అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ

గన్నేరువరం: మండలంలోని మైలారంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ నాగ్రోలు గురువారం గ్రామంలో విచారణ చేపట్టారు. సాంబయ్యపల్లెకు చెందిన గడ్డం మహేందర్‌రెడ్డి మంగళవారం తన కారును ర్యాష్‌గా డ్రైవ్ చేశాడు. ఇదేమిటని అడిగిన మైలారం ఎస్సీ కాలనీవాసులను అతనితోపాటు అనిల్‌రెడ్డి, అనంతరెడ్డి, తిరుపతిరెడ్డి కులం పేరుతో దూషించి, దాడి చేశారని గ్రామానికి చెందిన జక్కనపెల్లి లక్ష్మణ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

‘ఎమ్మెల్యేపై విమర్శలు తగవు’

చొప్పదండి: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శలు తగవని ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల అధికార పార్టీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే రామడుగు బ్రిడ్జిని కూడా ప్రారంభించలేదని విమర్శించారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెరుమాండ్ల గంగయ్యగౌడ్, నాయకులు కొట్టె అశోక్, ముద్దం తిరుపతిగౌడ్, గుర్రం రాజేందర్ రెడ్డి, మునిగాల సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



కాంతయ్య

గంగాధర: పీఆర్టీయూటీజీ గంగాధర మండల శాఖ అధ్యక్షుడిగా మొగిలి కాంతయ్య, ప్రధాన కార్యదర్శిగా ఇరుగురాల ప్రశాంత్‌లను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేతిరి తిరుపతిరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులను సంఘం నాయకులు అభినందించారు.

మొలంగూర్‌లో అగ్నిగుండాలు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ వీరభద్రస్వామి జాతర సందర్భంగా గురువారం తెల్లవారుజామున అగ్నిగుండాలు నిర్వహించారు. భక్తులు వాటిలో నడిచారు. అనంతరం స్వామివారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.

డప్పు కళాకారులకు సన్మానం

సైదాపూర్: ఎలబోతారానికి చెందిన డప్పు కళాకారులను మాజీ సర్పంచ్ మ్యాకల శిరీష, మారబోయిన వేణు గురువారం సన్మానించారు. ఢిల్లీలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ప్రధాని మోదీ ఎదుట ప్రదర్శన ఇచ్చి, ఈ ప్రాంతానికి గుర్తింపు తీసుకువచ్చారని అభినందించారు.

20న కొత్తగట్టు జాతర వేలంపాట

శంకరపట్నం: ఫిబ్రవరిలో కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి జాతర నిర్వహించనున్న నేపథ్యంలో ఆలయ ఆవరణలో ఈ నెల 20న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవో సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగట్టు గుట్టపై ఫిబ్రవరి 1 నుంచి 28 వరకు కొబ్బరికాయలు, పూజా సామగ్రి, ప్రసాదం విక్రయించేందుకు రూ.50 వేల ధరావత్తు చెల్లించి, వేలంపాటలో పాల్గొనాలన్నారు. టోల్‌గేట్, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు రూ.30 వేలు, తడకలు, పందిళ్లు, లైటింగ్, డెకరేషన్ కోసం రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే ఇంటిపై దాడికి యత్నం



గంగాధర: మండలంలోని బూరుగుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై గురువారం సాయంత్రం కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఇంటి గేటు తీసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని, ఠాణాకు తరలించారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

గంగాధర: జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని అయితుపల్లికి చెందిన కంకణాల రాజేంద్రప్రసాద్(40) అనారోగ్యంతో మృతి చెందినట్లు గంగాధర ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. రాజేంద్రప్రసాద్ కొన్ని రోజులుగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. బుధవారం రాత్రి ఇంట్లో చెప్పి, గంగాధర వెళ్లాడు. అక్కడే అకస్మాత్తుగా మృతి చెందాడు. మృతుడి తల్లి తులసి గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

శంకరపట్నం: జాతీయ రహదారి మాసోత్సవాలపై వాహనదారులకు కేశవపట్నం ఎస్సై రవి గురువారం అవగాహన కల్పించారు. అతివేగంతో వాహనాలు నడిపి, ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. ట్రైనీ ఎస్సై స్వాతి, ఏఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

చొప్పదండి: బీజేపీ చొప్పదండి పట్టణ శాఖ అధ్యక్షుడిగా ఎంపికైన చిల్ల శ్రవణ్‌ను మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ గురువారం సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేయాలని సూచించారు. నాయకులు కోటేశ్, రాజారాం, మల్లేశం, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

చొప్పదండి: పట్టణానికి చెందిన జాగిరి రాజయ్య (70) మృతిచెందగా దహన సంస్కారాలకు రామకృష్ణ సేవా సమితి సభ్యులు గురువారం రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. సమితి సభ్యులు బొల్లం ప్రవీణ్, కొక్కుల కనకయ్య, సిరిపురం గంగారాం, పడకంటి కృష్ణ తదితరులున్నారు.

‘లక్ష డప్పుల ప్రదర్శన’కు రండి

జమ్మికుంట: వర్గీకరణ అమలుకు కోసం ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వెయ్యి గొంతులు–లక్ష డప్పుల ప్రదర్శనకు రావాలని సమితి రాష్ట్ర కో–ఆర్డినేటర్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి రామంచ భరత్ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి జమ్మికుట పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. డప్పు కళాకారులతో ర్యాలీ నిర్వహించారు. కళామండలి జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రభు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కౌన్సిలర్ భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని కలిసిన దేవేందర్‌రెడ్డి

తిమ్మాపూర్: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి గురువారం హైదరాబాద్‌లో కలిశారు. అరెస్టు, తర్వాత పరిణామాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు.

క్రికెట్ విజేతలకు బహుమతి ప్రదానం

శంకరపట్నం: కేశవపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బొంగోని రాజయ్య స్మారకార్థం ఎస్సై రవి చేతుల మీదుగా గురువారం బహుమతి ప్రదానం చేశారు. ఫైనల్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్ ప్రభాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యులు రామస్వామి, తిరుపతి, అనిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బసవయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, కొత్తగట్టు ఆలయ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, ఆదర్శ యూత్ కార్యదర్శి అభిలాష్ పాల్గొన్నారు.

స్వశక్తి కార్యాలయానికి కుర్చీలు అందజేత

గంగాధర: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పంపించిన 50 కుర్చీలను గురువారం మండల కేంద్రంలోని స్వశక్తి కార్యాలయానికి అందజేశారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

రామడుగు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ వెంకటలక్ష్మికి గురువారం వినతిపత్రం అందజేశారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యుడు కట్ట రవీందర్, నాయకులు అంజిబాబు, సత్యనారాయణాచారి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

చిగురుమామిడి: నవాబుపేట్‌కు చెందిన మాజీ సర్పంచ్ చెప్యాల వేణు మృతిచెందగా బాధిత కుటుంబసభ్యులను బీఎస్పీ నాయకులు గురువారం పరామర్శించారు. పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్, అధ్యక్షుడు వేల్పుల రాజు తదితరులున్నారు. మాజీ ఉపసర్పంచ్ మంకు శ్రీనివాస్‌రెడ్డి మృతిచెందగా కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తిరుపతి, నాయకులున్నారు.

సాగుకు యోగ్యం కాని భూముల సర్వే



చిన్నముల్కనూర్‌లో కోళ్ల ఫారాలున్న భూములను పరిశీలిస్తున్న అధికారులు



జమ్మికుంట: సర్వే చేస్తున్న ఏవో ఖాదర్ హుస్సేన్, అధికారులు

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్, ఇందుర్తి, కొండాపూర్ గ్రామాల్లో అధికారులు సాగుకు యోగ్యం కాని భూములపై గురువారం సర్వే చేపట్టారు. కోళ్ల ఫారాలు, పెట్రోల్ పంపులున్న స్థలాలను గుర్తించారు. రైతు భరోసా పథకం అమలులో భాగంగా ఈ నెల 20వ తేదీ వరకు క్షేత్రస్థాయి పరిశీలన ఉంటుందని ఏవో రాజులు నాయుడు తెలిపారు. 24న గ్రామసభలు నిర్వహించి, ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రణయ్, సాయి, సతీశ్, ఆర్‌ఐలు అరుణ్‌కుమార్, తారామణి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: మండలంలోని సైదాబాద్, విలాసాగర్ గ్రామాల్లో సాగుకు యోగ్యం కాని భూములను అధికారులు సర్వే చేశారు. ఏవో ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో భూముల పరిశీలన తర్వాత ఈ నెల 21న గ్రామ సభల్లో జాబితా ప్రదర్శించి, తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం మడిపల్లి, బిజిగిరి షరీఫ్, తనుగుల, వావిలాల గ్రామాల్లో సర్వే చేస్తామని పేర్కొన్నారు.

సైదాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గురువారం సాగుకు యోగ్యం కాని భూముల సర్వే చేపట్టారు. రాయికల్‌లో తహసీల్దార్ మంజుల, ఏవో వైదేహి, సిబ్బంది వ్యవసాయానికి పనికిరాని, పనికి వచ్చే భూముల వివరాలు నమోదు చేశారు.

శంకరపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు గురువారం సర్వే చేపట్టారు. కొత్తగట్టు, గొల్లపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో కృష్ణప్రసాద్ పరిశీలించారు.

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం, ఖాసీంపేట, గునుకులకొండాపూర్, మాదాపూర్ గ్రామాల్లో సర్వేను గురువారం రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు ప్రారంభించారు. సాగుకు యోగ్యం కాని భూములను పరిశీలించారు. ఈ నెల 20 వరకు సర్వే పూర్తి చేసి, గుర్తించిన భూముల వివరాలను 22, 23వ తేదీల్లో గ్రామసభల్లో వెల్లడిస్తామని తెలిపారు. తహసీల్దార్ నరేందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, ఏవో కిరణ్మయి, ఆర్‌ఐలు రజనీకాంత్‌రెడ్డి, రాఘవేందర్, ఏఈవోలు అనూష, ప్రశాంత్, సాయికుమార్, కీర్తికుమారి, ఎంపీఎస్‌వో సాగర్, జూనియర్ అసిస్టెంట్ స్వప్న పాల్గొన్నారు.

‘అభివృద్ధిని మాజీ ఎమ్మెల్యే పట్టించుకోలే’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గంగాధర: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శిస్తే ఊరుకోబోమని రామడుగు మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజీ హరీశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబాసి బుచ్చయ్య, జిల్లా నాయకుడు తడగొండ నర్సింగ్‌బాబు హెచ్చరించారు. గంగాధర మండల కేంద్రంలోని మధురానగర్‌లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. బూరుగుపల్లిలో ప్యాలెస్ నిర్మించుకున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. అధికారుల బదిలీలకు డబ్బులు తీసుకున్న ఘనత ఆయనకే దక్కిందని ఎద్దేవా చేశారు. పార్టీ గంగాధర మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, నాయకులు హనుమంతు, శంకరయ్య, మధు, సుదర్శన్, మహేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘కేటీఆర్‌పై అక్రమంగా కేసులు’



ఈడీ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు

రామడుగు: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతూ మానసికంగా వేధిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, రామడుగు సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వేంకటేశ్వర్‌రావు ఆరోపించారు. ఫార్ములా ఈ–రేస్ కేసులో కేటీఆర్ గురువారం హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరైన సందర్భంగా అక్కడికి వెళ్లారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, నారదాసు లక్ష్మణరావు, బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు తదితరులున్నారు.

‘ఆరోగ్య మహిళ’ వినియోగించుకోవాలి



క్యాంపును ప్రారంభించిన చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్: ఆరోగ్య మహిళ క్యాంపును ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని మామిండ్లవాడ బస్తీ దవాఖానాలో గురువారం ఏర్పాటు చేసిన క్యాంపును ఆమె ప్రారంభించి, వైద్య పరీక్షలు చేయించుకున్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, సరైన వైద్యం చేయించుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. కౌన్సిలర్లు సుశీల, ఉజ్మా నూరిన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, చెల్పూర్ మెడికల్ ఆఫీసర్ మధుకర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సిట్టింగ్‌లు పెడితే చర్యలు



మాట్లాడుతున్న సీఐ రవి

జమ్మికుంట: పట్టణంలో అనుమతి లేకుండా మద్యం సిట్టింగ్‌లు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని టౌన్ సీఐ రవి హెచ్చరించారు. జమ్మికుంటలో రెండు రోజుల క్రితం ఓ హోటల్లో మందుబాబులు దాడి చేసుకున్న నేపథ్యంలో పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాత్రి హోటళ్లు, మెస్‌ల యజమానులు, నిర్వాహకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతీరోజు రాత్రి 10 గంటల తర్వాత హోటల్, మెస్‌లు తెరిచి ఉంచకూడదని సూచించారు. నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు.

అనాథ చిన్నారులకు చేయూత



పిల్లలకు డిపాజిట్ బాండ్లు ఇస్తున్న తహసీల్దార్ రాజేశ్వరి

మానకొండూర్ రూరల్: మండల కేంద్రంలో కొన్ని నెలల క్రితం కోండ్ర కల్యాణ్–ప్రహర్ష దంపతులు మృతిచెందగా వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. ఆ చిన్నారుల చదువులు, పోషణ ఖర్చులకు తహసీల్దార్ రాజేశ్వరి రూ.25 వేల చొప్పున బ్యాంకులో వారి పేరిట డిపాజిట్ చేశారు. సంబంధిత బాండ్లను గురువారం తన కార్యాలయంలో చిన్నారుల నాన్నమ్మ–తాతయ్య కోండ్ర భాగ్య–లక్ష్మయ్య, పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 9 మందికి జరిమానా

శంకరపట్నం: డ్రంకెన్ డ్రైవ్ కేసులో 9 మందికి హుజూరాబాద్ జడ్జి ఈశ్వరయ్య రూ.11 వేల జరిమానా విధించారని ఎస్సై రవి తెలిపారు. మద్యం సేవించి, వాహనాలు నడుపుతూ పట్టుబడినవారిని గురువారం కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.